


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్  వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో  పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# మాయాబజార్ -9

## (గత సంచిక తరువాయి)

అదే ముహూర్తానికి అభిమన్యుడు నిజ శశిరేఖ తలపై జీలకర్ర, బెల్లం ఉంచి కూర్చుంటాడు.

★★★

బలరాముని మందిరంలో – శర్మ మాంగల్యాన్ని సభికులచేత ముట్టిస్తుండగా సభ తుమ్ములతో మార్మోగుతుంది.

శకుని: ఆ మాత్రం ఆపుకోలేరూ?– అని తనుకూడా తుమ్ముతాడు. దుర్యోధన,దుశ్శాసన, కర్ణులు కూడా ఆపుకోలేక తుమ్ముతారు. బలరాముడు కోపంగా చూస్తాడు.

శ్రీకృష్ణుడు: నీళ్ళు కొత్తచేసినట్లున్నాయి. ఈ తుమ్ములు పాటిచేయ్యవులెండి. బావగారూ

కానివ్వండి. కానివ్వండి.——రేవతి (ఆనందించగా రుక్మిణి పరికిస్తుంది. ): నీళ్ళు కొత్తచేసినట్లున్నాయి. పాపం!

శర్మ మాంగల్యం తెచ్చి అందివ్వగా లక్ష్మణకుమారుడు ఆనందంతో మాంగల్యం అందుకుని సభకి అభివాదం చేస్తుండగా నేపథ్యంలో మాంగల్యం తంతునానేన– వినిపిస్తుంది. లక్ష్మణకుమారునికి శశిలో పెద్దపులి గాండ్రిస్తూ కనిపిస్తుంది.

లక్ష్మణకుమారుడు : పులి,పులి–నాన్నా పులి–అని మళ్ళీ దుష్ట చతుష్టయం వద్దకు పోతాడు. శ్రీకృష్ణుడు లేచి వస్తాడు.

శకు: సమర్ధిస్తూ– పులి కాదు నాయనా– కృష్ణుడు!

శ్రీకృష్ణుడు: ఔను అల్లుడూ.

మాయా శశి: అమ్మా–ఏఁవిటే నాకీ అల్లరి?

రేవతి: ఏమో తల్లీ. నేనేం పాపం చేశానో? ఏవండీ మీరు ముందుగా అబ్బాయిని చూడలేదుటండీ?

బలరా: ఏం. దుర్యోధనా. అబ్బాయికేమైనా చిత్తచాంచల్యం వుందా?

శకు: క్షమించాలి. వీరాధివీరుడు మా యువరాజు. ఇలా జడుసుకున్నాడంటే మాకే ఆశ్చర్యంగావుంది. వచ్చేదారిలో శత్రువులెవరో ఏదో ప్రయోగం చేసివుంటారు.

శ్రీకృష్ణుడు: ఐతే మీకు తెలియనిది ఏముంది? విభూతి పెట్టించి రక్ష కట్టించండి.

శకు: రండి– శర్మ,శాస్త్రి–వచ్చి: కవచమితి కవచమితి పరమం పవిత్రం– రక్ష ఇతి రక్ష ఇతి సుభగం సుచిత్రం రక్ష ఇతి రక్ష ఇతి సుభగం సుచిత్రం. లక్ష్మణకుమారునిపై విభూతి చల్లుతారు.

లక్ష్మణకుమారుడు: ఏమైనాసరే. ఈ పెళ్ళి నాకక్కర్లేదు.–– శకుని లక్ష్మణకుమారుని చెవిలో రహస్యంగా : నీవు వద్దంటే అభిమన్యునికి ఇచ్చి పెళ్ళిచేస్తారు.

లక్ష్మణకుమారుడు: ఆఁ –వీల్లేదు,నాకే కావాలి.

శకు: ఐతే పద.

★★★

అక్కడ ఘటోత్కచుని మందిరంలో అభిమన్యుడు నిజశశిరేఖకి మాంగల్యధారణం... (నేపథ్యంలో ... కంఠేబధ్నామి సుభగే సంజీవ శరదాం శతం)

★★★

బలరాముని మందిరం– లక్ష్మణకుమారుడు భయం భయంగా వణుకుతూ మాంగల్యం తీసుకోగా –శశి స్థానంలో బ్రహ్మ రాక్షసుడు భయంకరంగా బొబ్బలుపెడుతూ బెదిరిస్తాడు– లక్ష్మణకుమారుడు భీతితో దుష్ట చతుష్టయం వద్దకు వెళ్ళి వాలిపోతాడు. –నాయనా? అంటూ నేలపైకి

దించుతారు. మాయా శశి తృప్తిగా నవ్వుకుంటుంది. పెళ్ళిపెద్దలు చిన్నమయ,లంబు,జంబు హేళనగా నవ్వుతారు. కర్ణుని ఒడిలో లక్ష్మణకుమారుడు అపస్మారకంలో పలవరిస్తాడు. (నేపథ్యంలో ఎవరో –యువరాజు మూర్చ పోయాడు.) దుశ్శాసనుడు: ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం?

శకు: వచ్చిన మాయ మధ్యలో పోతేగాని ఈ మూర్చ తేలదు.

దుర్యో: మరేమిటిది మామా?

శకు:ఆఁ. ఏముందీ? కృష్ణుడు ఈ లగ్నాన్ని సమర్థించినప్పుడే సందేహించాను. పెళ్ళికూతుర్ని విడిదిలో చూచినప్పుడే అనుమానించాను. ఆఁ. ఇప్పుడీ మాయాజాలమంతా తెలిసిపోయింది. నిర్భయంగా చెపుతున్నాను. బలదేవా. ఈ కనిపించేది శశిరేఖకాదు. ఏదో రాక్షసి. ఇలా నిన్నూ నన్నూ మోసం చేసింది నీ తమ్ముడు కృష్ణుడే!

బల: ఆఁ. నా తమ్ముడా? (శ్రీకృష్ణుడు చిద్విలాసంగా నవ్వుతాడు.) ఏవిఁటి మీరు మాట్లాడేది? –సాత్యకి–సత్యపీఠం తెచ్చి: అన్నయ్యా.మీరు ఆగ్రహించకండి. మోసం ఎవరిదో తేల్చటానికి ఈ పీఠం సిద్ధం చేశాను. ఏం మాయాజూదరీ? ఏ దురాశా దుర్బుద్ధీ లేకుండానే మీరిక్కడికి వచ్చారా? నిజం ఈ పీఠమ్మీద నిల్చుని మాట్లాడితే తెలుస్తుంది.

శకు: సరే. అక్కడ నుంచునే మాట్లాడతాను.

దుర్యో–ఆందోళనగా:మామా.

శకు: భయమెందుకు దుర్యోధనా? నా అంతట నేను బుద్ధిపూర్వకంగా చెపితేతప్ప నా మనసులోని మాట ఇంకొకరికి ఎలా తెలుస్తుంది? –శకుని సత్య పీఠం ఎక్కి నిలబడతాడు. పీఠం ప్రభావంతో అతని చీకటి ఆలోచనలు బయటికి వస్తాయి.

బల–తీవ్రకోపంతో: ఎవరూ అడ్డంకిపరచకండి.ఈ మోసమేదో తెలియాలి. – శ్రీకృష్ణుడు అన్నపక్కన చేతులుకట్టుకుని నిల్చుంటాడు––సాత్యకీ. ఏది నా ముసలం?

శకుని––వెనక దుర్యోధన,దుశ్శాసన,కర్ణులు: సావధానం బలదేవా సావధానం. ఇదుగో నా పాచికలమీద ఒట్టుపెట్టుకుని ఉన్నది ఉన్నట్లుగా చెప్తున్నాను. మోసం చేసి కపటజూదం లో పాండవుల రాజ్యం కాజేశాం. ధర్మానికి కట్టుబడి వాళ్ళు వనవాసానికి వెళ్ళారు. ఈ దుర్వార్త విని నీవు మమ్మల్ని దండించడానికి వచ్చావు.––హేళనగా––కాని నీవొక వెర్రిబాగుల యాదవుడవు. ఆఁ! అఖండ సన్మానానికి, ముఖస్తుతికి లోబడతావని నాకు తెలుసు. అలాగే లోబడ్డావు. (బలరాముడు ఆశ్చర్యపోతాడు. నిజమెరిగిన శ్రీకృష్ణుడు అతడిని గౌరవంతో జాలిగా చూస్తాడు. ) నీవు సాటివాడవు కాకపోయినా నీ సంబంధం ఎందుకు కోరి తెచ్చుకున్నాం అనుకున్నావు? వనవాసానంతరం పాండవులు విజృంభిస్తే మళ్ళీ వాళ్ళకు నీ సహాయం, నీతోపాటు నీ తమ్ముడి సహాయం లేకుండా చెయ్యటానికి. (బలరాముని దిగ్భ్రాంతి. అన్న వెర్రిబాగులతనం బయల్పడడంతో శ్రీకృష్ణుని చిద్విలాసం.) కాని,––యతోధర్మస్తతో జయః.!!! అన్నట్లు మాకు తగ్గిన శాస్తే జరిగింది. –శకుని కుటిలంగా నవ్వుతూ పీఠం దిగిపోతాడు.

బలరాముడు కోపంతో ఊగిపోతూ : కృష్ణా! ఇంతమోసం చేసినవాళ్ళకు ఈ శాస్తి చాలదు. ఏది నా ముసలం?

శ్రీకృష్ణుడు: అన్నయ్యా అంతలో మాయా శశి అహ్హహ్హా అంటూ ఘటోత్కచునిగా మారి: పెదమామగారూ.నమోనమః, ––శ్రీకృష్ణుడు ఆశీర్వదిస్తాడు. –పెద్దలు తమకెందులకీ శ్రమ? ఈ దురాత్ముల పీచమడచడానికి నేనున్నాను.

దుర్యో: ఆఁ. ఎవడవురానీవు?

ఘటో:: నేనా? ఎవడనా? ఘోషయాత్రలో గంధర్వులు నిన్ను బంధించినప్పుడు వచ్చివిడిపించెనే ? ఆ అర్జున ఫల్గుణ బీభత్సబాబాయిగారి అన్న భీమసేన మహారాజు –––దర్పంగా––వారి కుమారుడను. –దుష్టచతుష్టయం ఆశ్చర్యపోతారు. –

దుర్యో: ఓరీ. నువ్వురా ఘటోత్కచా? కర్ణా,దుశ్శాసనా వీణ్ణి పట్టండి. –కత్తులు వాళ్ళ ఒరలనుండి ఊడిరావు. దుర్యోధనుని కత్తి మాయమౌతుంది.

ఘటో: ఓరోరీ దుర్యోధన,దుశ్శాసన, కర్ణ హంతకులారా? అతి దురాత్ములు మీరు. మీకు సహాయ పడక ఆయుధాలు వాటి పరువు దక్కించుకున్నాయి. ఓరి మూర్ఖులారా? మీ ఐశ్వర్యం చూసి తుళ్ళిపడుతున్నారు కదూ? ఇప్పుడు చూడు ఎవరి ఐశ్వర్యాన్ని మీరు మోస్తున్నారో? చిన్నమయా...

చిన్నమయ మంత్ర దండం ఊపుతూ——అం అః,ఇం ఇః, ఉం ఉః.——దుష్టచతుష్టయం తలలపై కాటికి పోయే మట్టిపిడతలలో నిప్పు పొగలు, మెడలలో నిమ్మకాయల దండలు. వాళ్ళు జుగుప్సతో తలలపై కుంపట్లు విసిరికొట్టి, మెడలలో దండలు తెంపి పడవేస్తారు. పరివారం భయభ్రాంతులై పరిగెడుతుంటే నేలపై పాములు పడగలెత్తి బుసలుకొడుతూ కాళ్ళకు చుట్టుకుంటాయి. ఘటోత్కచుని అనుచరగణం రాక్షసులు వాళ్ళను తరుముతుంటే చిన్నమయ.లంబు,జంబు పగలబడి నవ్వుతారు. ఘటోత్కచుడు ఆనందిస్తూ——ఆహా. ఆర్తనాదములు శ్రవణానందకరముగనున్నవి. ఛీ. శరణార్థులను చంపడమెందుకురా ? పిరికిపందలు. లంబు,జంబు. ఈ దుర్మార్గులను కట్టకట్టి ఎత్తుకునిపోయి హస్తినాపురిలో పారవెయ్యండి. —చిన్నమయ మంత్రంతో  దుష్టచతుష్టయంపై పెద్ద కంబళి పరచగా, తాళ్ళు వాళ్ళని మూటగా బంధించి తన్నుకుంటున్న వాళ్ళను గాలిలో లేపి ఎత్తుకుపోతాయి. ఘటోత్కచుడు,చిన్నమయ,లంబు,జంబు అట్టహాసంగా నవ్వుకుంటారు. —రేవతి,రుక్మిణి వచ్చి చేరుతారు. ఘ: నమోనమః. పెదమామగారు మన్నించాలి.

బల–ప్రశంసిస్తూ ఘటోత్కచునిభుజంపై చెయ్యివేసి : కృష్ణా. మన భీమకుమారుడు ఇంతటి ఘటికుడని అనుకోలేదు.

రేవతి: ఇంతకీ మన అమ్మాయి ఏదండీ?

బల: ఔను కృష్ణా. శశి ఎక్కడ?

శ్రీకృష్ణుడు: అల్లుడూ?

ఘ: నమోనమః. పెద్దత్తగారికి నా మనవి. ఈ లగ్నానికే నా ఇంట్లో అభిమన్యుకుమారునికీ శశిరేఖకు సలక్షణంగా వివాహం జరిగింది. మీరు వచ్చి ఆశీర్వదించి నా ఆశ్రమాన్ని పావనం చెయ్యాలి.

రే–తహతహగా: ఐతే ఇంకా చూస్తారేం? పదండీ.

శ్రీకృ: పదండి అన్నయ్యా. —అందరూ కదిలి వెళ్తారు.

★★★

ఘటోత్కచుని మందిరంలో అభిమన్యుడు,శశిరేఖ  బలరామ,రేవతిలకి, శ్రీకృష్ణ,రుక్మిణిలకి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకుంటారు.

రేవతి హిడింబతో: వదినా.హిడింబా. మా అమ్మాయిపెళ్ళి చివరికి మీ ఇంట్లోనే జరిపించావు.

సుభద్ర: ఏ ఇంట్లో జరిగినా మాకా పట్టింపులేం లేవులే వదినా.

రేవతి: నా మాటే నాకు అప్పగించావులే!——శశిని తెచ్చి– ఇక అమ్మాయిని సంతోషంగా నీకు అప్పగిస్తున్నాను.

హిడింబ: మీ అప్పగింతలమాట ఎలా వున్నా ఈ ఘనకార్యమంతా నా సుపుత్రుడు చేశాడు. చాలా సంతోషం.

ఘ: కాదు మాతా కాదు. ఇది ఎల్ల శ్రీకృష్ణులవారి లీల. —నమస్కరిస్తూ:నమోకృష్ణ. నమోకృష్ణ.

జై సత్య సంకల్ప –జై శేషతల్పా (శ్రీకృష్ణుడు అభయహస్తంతో ఆశీర్వదిస్తాడు.)

జై దుష్ట సంహార —జై దీనకల్పా

జై భక్తపరిపాల —జై జగజ్జాలా

నీవు జరిపించేది నీ చిత్ర కథలు

రాసినా చూసినా వినిన ఎల్లరును శుభసంపదలుకల్గి వర్ధిల్లగలరు

సుఖశాంతులను కల్గి శోభిల్లగలరు ...

అందరూ చేతుకలు జోడించి నమస్కరించగా శ్రీకృష్ణుడు చతుర్భుజుడైన నారాయణునిగా దర్శనమిస్తాడు. ––శుభం——సమాప్తం.

[విజయావారి సినిమాలు రివాజుగా మంగళాశాసనం తో సమాప్తమౌతాయి}]

---

Post your comments